


# రచయిత

శ్రీశర్మ

అర్ధరాత్రి దాటింది. సత్యమూర్తి యింకా వ్రాస్తూనే వున్నాడు. అనుకున్న ప్రకారం ఆ నవల యింకా పూర్తి కాలేదు. ఆ రాత్రికి దాన్నెలాగైనా పూర్తి చెయ్యాలని అతని సంకల్పం. అందుకే ఎంతో పట్టుదలగా, ఓపిగ్గా కూర్చొని వ్రాస్తున్నాడు. వ్రాస్తున్న వాడల్లా ఒక్కక్షణం ఆగి బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. వకటే ఆవలింతలు. నిద్రాదేవి ఆవరిస్తున్న సూచనలు కన్పిస్తున్నాయి. లేచి వెళ్ళి చన్నీళ్లతో మొహం కడుక్కు వచ్చాడు. మళ్ళీ కూర్చుని వ్రాయడం మొదలు పెట్టాడు. ఆ క్రితం రోజునుంచీ పస్తుండడం వల్ల ఒకటే ఆకలి. దానివల్ల కల్గిన నీరసం. తను ఎంతో వేగంగా వ్రాస్తున్నానని అనుకుంటున్నాడు కాని నిజానికి అతను అనుకున్నంత వేగంగా కలం సాగడంలేదు. ఎలాగైనా అతనా నవల పూర్తి చెయ్యాలి. అది ఏ పబ్లిషర్‌కైనా యిచ్చి నాలుగు డబ్బులు తీసుకు రాగల్గాలి. అప్పుడుగాని అతనికీ, సుశీలకీ పస్తులు తప్పవు. అందుకే అత వంత దీక్షగా వ్రాస్తున్నది. టేబుల్ మీద కిర్సనాయిల్ బుడ్డి గుడ్డి వెలుతురు చూపిస్తోంది. అయినా అతనికా ధ్యాసలేదు. అలాగే మెడ వంచుకుని చక చక వ్రాస్తున్నాడు. గంటలకి గంటలు గడుస్తున్నాయి. కుడిచేతి వైపున అతను వ్రాసిన కాగితాల గుట్ట క్రమేపీ పెరుగుతోంది.

ప్రక్కింట్లో గోడ గడియారం మూడు గంటలు కొట్టడం స్పష్టంగా విన్పించింది. అతను రాయడం కూడా పూర్తయ్యింది. పెన్ను మూసేస్తూ టేబిల్ మీదున్న కిర్సనాయిల్ బుడ్డిని చూసాడు. కొడిగట్టి ఆరిపోవడానికి సిద్ధంగా వుంది. దాంట్లో కిర్సనాయిలు అయిపోయింది. అతని కడుపంతా ఆకలితో దహించుకు పోతోంది. ఇంట్లో ఏమీ లేవు. ఏం చేస్తాడు? లేచి వంటింట్లోకి వెళ్లాడు. కడుపు నిండుగా నీళ్ళు త్రాగి వస్తూండగా మధ్య గదిలో చాప మీద పడుకున్న సుశీల కనిపించింది. అటూ యిటూ కదులుతోంది. ఆమెకీ నిద్ర పట్టడం లేదన్నమాట. ఎలా పడుతుంది? ఒక మూల కడుపు ఆకలితో దహించుకుపోతూంటే? ఉస్సూరు మని నిట్టూర్చి తన గదిలోకి చేరుకున్నాడు. మంచం మీద పడుకుని మర్నాడు తను చెయ్యవల్సిన కార్యక్రమం గురించి ఆలోచిస్తున్నాడు. ఎవరెవర్ని కలుసుకోవాలా? ఏ పబ్లిషర్‌తో ఎలా మాట్లాడాలా అని ఆ నవల ద్వారా సాధ్యమైనంత ఎక్కువ మొత్తాన్ని రాబట్టాలని అతని ఉద్దేశ్యం. సుమారు రెండు నెలల నుంచీ ఆ నవల వ్రాస్తున్నాడు. దాని కోసం తన మేధస్సునంతా ఉపయోగించాడు. అదృష్టవశాత్తూ అతను అనుకున్న దానికంటే బాగానే వ్రాయగల్గాడు. అందుకే అతని కంత నమ్మకం.

ఏమిటేమిటో ఆలోచిస్తూ ఎప్పటికో నిద్ర పోయాడు. మర్నాడు 8 గంటలకి కాని అతనికి మెళకువ రాలేదు. గబగబా లేచి ముఖం కడుక్కున్నాడు. బట్టలు వేసుకుని గతరాత్రి తను పూర్తి చేసిన నవల తాలూకు ఫైలు తీసుకుని బయుల్దేరాడు. గుమ్మం దాటు బోతూండగా సుశీల నెమ్మదిగా వెనక నించి అంది.

"ఇంట్లో ఏమీ లేవు." అని. దాంతో సత్యమూర్తికి కొంచెం కోపం వచ్చింది. "తెలుసు. అందుకే వెళుతున్నది.." అన్నాడు విసురుగా.

"ఈ పూటకైనా ఎక్కడో అక్కడ కొంచెం అప్పు తీసుకు వస్తే..?"

"అబ్బబ్బ! ఎందుకు నా ప్రాణం తీస్తావ్? నాకు మాత్రం ఇంట్లో ఏమీ లేవని తెలియదూ? ప్రొద్దున్నే పని గట్టుకు చెప్పడం దేనికి? తెల్లారగానే ఏదో ఒకగొడవ." ఇంకా ఏదో తనలో తను సణుక్కుంటూ బయటికి వెళ్ళిపోయాడు. నిజానికి సత్యమూర్తికి చాలా శాంతం ఎక్కువ. అలాంటిది రెండు రోజుల్నించి అతను కోపగించుకుంటున్నాడంటే కేవలం డబ్బు లేమి వల్లనే అని సుశీలకి తెలుసు. అందుకే ఆమెకేమీ బాధ కలగలేదు. పరిస్థితులు అలాంటివి. అతను మాత్రం ఏం చేస్తాడు? అక్కడికీ అందిన చోట్లల్లా అప్పు తెచ్చాడు. ఇక ఆ అప్పు గూడా పుట్టడం మానివేసింది. దాంతో రెండు రోజుల్నించి పస్తులు పడుకోవల్సి వచ్చింది.

సత్యమూర్తి తనకి బాగా తెల్సిన ఒకటి రెండు పబ్లిషింగు కంపెనీలకు వెళ్లాడు. ముందు ఒక చోటుకి వెళితే ఆ కంపెనీ ప్రొప్రయిటర్ యింకా రాలేదని తెల్సింది. ఈ లోపల మరో కంపెనీకి వెళ్లాడు. ఆ పబ్లిషర్ ఎంతో మంచివాడు. సౌమ్యుడు. సత్యమూర్తికీ ఆయనకీ బాగా పరిచయముంది. ఇంతకుముందు ఆయన సత్యమూర్తి నవలలు రెండుమూడు ప్రింట్ చేసాడు కూడా. సత్యమూర్తి ఎంతో నమ్మకంతో ఆయన దగ్గరి కొచ్చాడు. పలకరింపులవీ అయ్యాక ఆయన కుర్రాణ్ణి పిలిచి కాఫీలు తీసుకురమ్మని పంపించాడు. "శుభ సూచకం" అనుకున్నాడు సత్యమూర్తి. రెండు రోజుల్నించి కాఫీ తాగలేదేమో కాఫీ అనగానే అతనికి నోరూరింది. ఆయనేదో తను ఈ మధ్య ప్రింట్ చేసిన నవలల గురించి, వాటి అమ్మకాల గురించి చెబుతున్నాడు. సత్యమూర్తికి అవేమీ చెవికెక్కడం లేదు. అతని ధ్యాసంతా కాఫీ మీదే వుంది. పది నిమిషాల కల్లా కాఫీ లొచ్చాయి. ఇద్దరు తాగడం పూర్తయ్యాక సత్యమూర్తి తను వచ్చిన

పని గురించి చెప్పాడు. ఆయన అంతా విని, "ఐయామ్ సారీ. సత్యమూర్తి గారూ. నేను నిన్ననే రెండు స్క్రిప్ట్స్ తీసుకున్నాను." అన్నాడు. సత్యమూర్తి తన ప్రస్తుత పరిస్థితంతా వివరించి చెప్పాడు.

"నిజమే సత్యమూర్తి గారూ! నేను మాత్రం ఏం చెయ్యను? ఇదే మీరు నిన్న గనుక వచ్చి వుంటే తప్పకుండా తీసుకునే వాడ్ని." అన్నాడు.

"అయితే యింకేమీ లాభం లేదంటారా" ఎంతో నిరాశగా అడిగాడు సత్యమూర్తి.

"ఎక్స్‌క్యూజ్ మీ. ప్రస్తుతం నేను ఏమీ సహాయపడలేక పోతున్నందుకు చాలా సిగ్గుపడు తున్నాను" అన్నాడు బాధను వ్యక్తపరుస్తూ. ఆయన అవకాశముంటే కాదనే వ్యక్తి కాడని సత్యమూర్తికి తెలుసు. అందుకే యింకేమీ మాట్లాడలేకపోయాడు.

"సరే! వెళ్ళొస్తానండీ!" అని నమస్కారం చేసి బయటికి వెళ్ళబోతూండగా, "జాలీ పబ్లికేషన్స్‌కి వెళ్ళారా?" అని అడిగాడాయన వెనకి నుంచి

"జాలీ పబ్లికేషన్స్‌కా?" అన్నాడు ఆశ్చర్యంగా, "అక్కడి కెందుకు? వాళ్ళు డిటెక్టివ్‌లు తప్ప యింకేమీ తీసుకోరుగా?" అన్నాడు.

"అవుననుకోండి. ఒకవారం క్రితం ఆ ప్రొప్రయిటర్ కనిపించి మంచి సాంఘికా లేమయినా వుంటే తీసుకుంటానని చెప్పాడు. పోనీ ఒకసారి వెళ్ళి రాకూడదూ?" అన్నాడు.

"అయితే సరే. వెళ్ళి కలుసుకుంటాను." అన్నాడు సత్యమూర్తి.

"మంచిది. నేను పంపించానని చెప్పండి." అన్నాడాయన.

"అలాగే!" అని సత్యమూర్తి బయటికి వచ్చే శాడు సరిగ్గా తొమ్మిది గంటలకల్లా జాలీ పబ్లికేషన్స్ ఆఫీసు కొచ్చాడు. చిన్న చీటీ మీద తన పేరు, వచ్చిన పని గురించి వ్రాసి ప్రొప్రయిటర్ గదిలోకి పంపించాడు. అరగంట గడిచిందాకా ఆయన దగ్గరనుంచి పిలుపు రాలేదు. ప్యూన్ వచ్చి, "మిమ్మల్ని రమ్మంటున్నారు." అన్నాడు. సత్యమూర్తి లోపలికి అడుగుపెట్టి నమస్కారం చేసాడు. ఆయన కూడా ప్రతినమస్కారం చేస్తూ "రండి. కూర్చోండి." అన్నాడు. సత్యమూర్తి కూర్చోగానే, "మీరే కదూ సత్యమూర్తి." అని అడిగాడు.

"అవును." అన్నాడు.

"మీ పేరు విన్నాను. మీ రచనలు కూడా చాలా చదివాను. మీలాంటి పెద్ద రచయితల్ని ప్రత్యక్షంగా కలుసుకో గల్గినందుకు చాలా సంతోషిస్తున్నాను." అన్నాడు ఉత్సాహంగా.

సత్యమూర్తి నవ్వి ఊరుకున్నాడు.

"అయినా మీలాంటి పెద్ద రచయితలు ఇంత చిన్న కంపెనీలకు వస్తారని కలలో కూడా అనుకోలేదు సుమా!" అన్నాడు.

"ఇందులో పెద్దా చిన్నా ఏముంది? మీరు చేస్తున్నది కూడా సాహిత్య సేవేగా?" అన్నాడు సత్యమూర్తి.

"అవుననుకోండి. అయినా ఈ సత్యాన్ని అందరూ గుర్తించడం లేదుగా? డిటెక్టివ్ సాహిత్యం అంటే యింకా కొద్దిమందిలో నీచ భావం వుంది? దీనికి కారణమేమిటంటారూ?" అని అడిగాడు.

"బహుశా వాటివల్ల సాంఘిక ప్రయోజనం లేదని వాళ్ళ ఉద్దేశ్యమేమో." అన్నాడు.

"అయితే మీరూ ఒక రచయితేగా! మీరు చెప్పండి. వ్రాసిన ప్రతీ సాంఘిక రచనా సంఘంలో మార్పు తీసుకు రాగలుగుతోందంటారా?" అని సూటిగా అడిగాడాయన.

"అది ఆ రచనా సాహిత్యం మీదా, తీసుకున్న సమస్య మీదా ఆధారపడి వుంటుంది." అని ఆయన అనవసరంగా కాలం వృధా చేస్తున్నాడని గ్రహించి, "ఇప్పుడా చర్చంతా దేనికిలెండి?" అన్నాడు సంభాషణ మార్చాలన్న ఉద్దేశ్యంతో.

"నో..నో నో. మిస్టర్ సత్యమూర్తి. ఇది చాలా ముఖ్య విషయం. నేను మీ గురించి మర్చిపోయి ఏదో మాట్లాడుతున్నా ననుకోకండి. ఇదంతా మీ కోసమే." అని, "ఏదీ? మీరు పట్టుకొచ్చిన రచన యిటు యివ్వండి" అన్నాడు చెయ్యి చాపుతూ. సత్యమూర్తి ఫైలు తెరిచి స్క్రిప్ట్ తీసి టేబుల్ మీద పెట్టాడు. అది ఆయన చేతిలోకి తీసుకుని అటూ యిటూ త్రిప్పి ముందు పేజీలెన్నో చూసాడు. సుమారు మూడు వందల ఏభై వున్నాయి.

ఆయన చప్పరిస్తూ, "కష్టపడి మీరింత స్క్రిప్ట్ వ్రాశారు. ఏం ప్రయోజనం చెప్పండి?" అన్నాడు. ఆయన ధోరణేమిటో అర్థంకాక సత్యమూర్తి తెల్లబోయి చూసాడు. గభాలున "అంటే నా ఉద్దేశ్యం ఇదంతా దండగని" అన్నాడు. సత్యమూర్తికి గుండె పగిలినంత పనయింది

"మీరు మరోలా అనుకోకండి. సింపుల్‌గా ఒక వంద పేజీల్లో ఏదైనా డిటెక్టివ్ నవల వ్రాస్తే ప్రింట్ చెయ్యడం మాకూ తేలిక. మీకూ, ఎక్కువ గిట్టుబాటవుతుంది ఇకపోతే వ్యాపార దృష్టితో ఆలోచించినా మా నవలలు మార్కెట్‌లో దిగిన వెంటనే అమ్ముడుపోతాయి. ఇక ఈ సాంఘికాలు అంటారా! ఎవడు కొంటాడు చెప్పండి? ఇవి ప్రింట్ చెయ్యడానికా ఎక్కువ ఖర్చుపెట్టాలి అందుకు ధర కూడా ఎక్కువ పెట్టాలి. మూడు నాలుగు రూపాయలు పెట్టి ఎవరు కొంటారు? నూటికి పది అమ్మడం కూడా కష్టం. స్టాక్ అంతా నిలవ వుండిపోతే యిక మాకు టర్నోవర్ ఎలా? చెప్పండి. నష్టానికి వ్యాపారం చెయ్యగలమా?"

"అయితే ఏం చెయ్యమంటారు?" విసుగ్గా అడిగాడు సత్యమూర్తి.

"నా మాట విని మీరు కూడా డిటెక్టివ్‌లు రాయండి. అప్పుడు మీరిలా మా దగ్గరికి రానక్కర్లేదు. మేమే మీదగ్గరి కొచ్చి స్క్రిప్ట్ తీసుకుంటాం." అని సలహా యిచ్చాడు.

"థాంక్స్. ఇక మీదట మీ సలహా పాటిస్తాను. ప్రస్తుతం దీని విషయం తేల్చేస్తే..?" అంటూ నసిగాడు సత్యమూర్తి.

"తేల్చడానికేముంది? ఇంతంత పెద్ద నవల్స్ నేను టేకప్ చెయ్యలేను. ఏదైనా మంచి డిటెక్టివ్ రాసి పట్టండి. తప్పకుండా తీసుకుంటాను." అన్నాడు. ఇక తప్పని సరయి సత్యమూర్తి తన పరిస్థితి నంతా వివరించి చెప్పాడు.

"మీ దగ్గర సిగ్గు విడిచి చెపుతున్నాను. ఈ పూట యింట్లో బియ్యానికి కూడా లేవు. మిమ్మల్నే నమ్ముకుని వచ్చాను. శ్రీనివాసరావుగారు మిమ్మల్ని కలుసుకోమంటే ఎంతో ఆశపడి వచ్చాను. ప్లీజ్. ఈ ఒక్కసారికి తీసుకోండి." అంటూ ఎంతో ప్రాధేయ పూర్వకంగా బ్రతిమాలాడు. ఆయన ఛెయిర్లో వడుకుని కాస్సేపు ఏదో దీర్ఘంగా ఆలోచించాడు. తర్వాత ఒక నిశ్చయాని కొచ్చి, "ఆల్ రైట్ మీరింతగా ప్రాధేయపడుతున్నారు కాబట్టి, అదీగాక మా కో పబ్లిషర్ శ్రీనివాసరావు పంపించాడు కాబట్టి మీ నవల నేను టేకప్ చేస్తున్నాను. తీసుకోండి" అంటూ పర్సు తీసి ఐదు పదు లివ్వబోయాడు.

"ఇంతేనా?" అన్నాడు సత్యమూర్తి.

"అవును. ఇంతకంటే ఎక్కువెవరిస్తారు?" అని అడిగాడాయన.

"ఈ నవలకి కనీసం రెండు వందలైనా యిస్తారు"

"అయితే యింకేం? నిరభ్యంతరంగా తీసుకెళ్ళి అమ్ముకోండి నన్ను బ్రతిమాలడం దేనికి?" అంటూ స్క్రిప్ట్ తిరిగి యిచ్చేస్తూ, "యిక వెళ్ళి రండి" అన్నాడు. సత్యమూర్తి మంచి యిరకాటంలో పడిపోయాడు. తన రక్తంతా ధారపోసి వ్రాసిన ఒక ఉత్తమ సాహిత్యాన్ని అంత తక్కువ ధరకి అమ్మడమా! లేక వచ్చిన ఆ కొద్ది మొత్తంతో సంతృప్తిపడి ప్రస్తుత అవసరాలు గడుపుకోవడమో తేల్చుకోలేకపోయాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"ఇంకానిలబడ్డారేం? ప్లీజ్. వెళ్ళిరండి నాకింకా వేరే పనులున్నాయి" అన్నాడాయన ఈసడింపుగా. సత్యమూర్తికి తల కొట్టేసినట్లయింది ఇక అక్కడ వుండలేక బయటికొచ్చేశాడు మధ్యాహ్నం ఒంటి గంట దాకా తిరిగాడు. ఎక్కడికి వెళ్ళినా చుక్కె ఎదురయింది. విసుగుపుట్టి యింటి మొహం పట్టాడు.

బట్టలు విప్పుతూండగా సుశీల అంది. "లేవండి భోంచేద్దురు గాని" అని. సత్యమూర్తి ఆశ్చర్యంగా ఆమె మొహంలోకి చూసాడు

"బియ్యం అవీ ఎక్కడ్నించి వచ్చాయి. మీయింటి కెళ్ళావా?" అని అడిగాడు.

"లేదు." అని జవాబిచ్చింది.

"మరెక్కడించి వచ్చాయి? మీయింటికే వెళ్ళుంటావు. నామొగుడు అసమర్థుడై తీయాడనీ రెండు రోజుల్నించి పస్తులుంటున్నామని మీనాన్నతో మొరపెట్టుకుని వుంటావ్? అవునా?" అన్నాడు. కోపంగా.

"లేదండి? నేనసలు అక్కడికి వెళ్ళనేలేదు". అంది. "సుశీ!" బిగ్గరగా అరిచాడు సత్యమూర్తి. "అబద్ధమాడకు నన్నవమానించడానికి కాకపోతే యిదంతా ఏమిటి? నేను ఆనాడే చెప్పాను. నన్ను చేసుకుని నువ్వేమీ సుఖపడలేవని, కోటీశ్వరుడైన మీ నాన్నని విడిచిపెట్టి రావద్దని. కాని నువ్వు వింటేనా? ప్రేమనీ, సాహిత్యాభిలాషని ఆశయాలకి పోయి నీజీవితం నువ్వే

వాళ్ళనూ చేసుకున్నావు. నాకూ శనిలా దాపురించి నన్నుకూడా నాశనం చేశావ్! ఉద్రేకంగా అతనన్న మాటలకి—

సుశీల కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. గొంతు గాద్గదికంగా తయారైంది. "మన పెళ్ళివిషయంలో మాట పట్టింపులు వచ్చిన దగ్గరనుంచీ ఈనాటి వరకూ నేనా గడప త్రొక్కనే లేదు ఆయనదగ్గర లక్షలుంటే వుండొచ్చు అంతమాత్రానికి ఏదో కష్టాలు వచ్చాయని అభిమానం చంపుకుని ఆయన దగ్గరికి వెళతా ననుకున్నారా? మీ కిష్టం లేని పనిచేస్తానా? అంత వెళ్లే ఉద్దేశ్యమే వుంటే ఈరెండు రోజుల్నించి పస్తులు పడుకోవడం దేనికి?" అంది ఆమెకూడా ఉక్రోషంగానే

సత్యమూర్తి కొంచెం ఆలోచనలో పడ్డాడు.

"మరయితే అవన్నీ ఎక్కడ్నించి వచ్చాయి?" అని అడిగాడు.

"ప్రక్కింటి వాళ్ళదగ్గర అప్పుతీసుకొచ్చాను" అంది.

"ఆమాట సత్యమూర్తికి ఎంతో బాధ కలిగించింది. అయినా ఏం చేస్తాడు? ఇంకా నయం. ఎక్కడో అక్కడ అప్పైనా తీసుకొచ్చి సుశీల ఆ పూట గడుపుతోంది. అందుకే యింకేమీ మాట్లాడలేక పోయాడు. నిజానికి తీర్చగలిగే వాడికి అప్పుకాని లేనివాడికేమిటి? అది భిక్షతోనే సమానం.

"భోజనానికి లేవండి." అంది సుశీల, అతని పరధ్యాన్నం గుర్తించి. ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. నగపెడ తింటూండగా సుశీల అంది. 'పోనీ ఏదైనా ఉద్యోగం చూసుకో కూడదూ?" అని అది ఆమె అభిప్రాయం కాదని సత్యమూర్తికి

# రచయిత

తెల్సు. "బాగానే వుంటుంది. కాని యిచ్చేవాళ్ళు ఉండొద్దూ?" అన్నాడు.

"మీకేం? బి. ఏ. పాసయ్యారు ఆ మాత్రం దొరకదూ? సత్యనారాయణగారికి ఎవరో కంపెనీ మేనేజర్ తెలుసుట. ఆయన్ని కలుసుకుంటే మీకు తప్పకుండా ఉద్యోగం దొరుకుతుంది" అంది. ఆమె ఎంతో ఉబలాట పడడం చూసాడు.

"అయితేసరే. వెళ్లి కల్సుకుంటాలే" అన్నాడు

"ఫోంచేసి ఈపూటే వెళ్లి కలుసుకోండి. ఇవ్వాళ ఆయనికి శలవుట. మధ్యాహ్నం యింట్లోనే వుంటానని చెప్పారు." అంది.

అప్పుడే సుశీల ఆయనతో అన్ని మాట్లాడి వుంచిందని గ్రహించాడు. తనుకూడా ఆలోచించ సాగాడు. అదే మంచిదని తోచింది. దినదిన గండంగా ఎన్నాళ్ళిలా బ్రతకడం? ప్రతీనెలా ఎదోకొంత నికరాదాయం, వస్తూంటే యిక ఈ ఆర్థిక బాధ ఉండదు. వీలునిబట్టి ఈ రచనా వ్యాసంగం కొన సాగించవచ్చు ననుకున్నాడు. ఈ నిశ్చయానికి రాగానే సత్యనారాయణగార్ని కలుసుకోవడం చాలా అవసరం అని తోచిందతనికి.

మధ్యాహ్నం సత్యమూర్తి వెళ్లేసరికి ఆయన పడక కుర్చీలో పడుకుని పేపర్ చదువు కుంటున్నారు. సత్యమూర్తిని చూడగానే "రండి, రండి" అని ఆహ్వానించి ఎదురుగావున్న కుర్చీ చూపించాడు. ఆ తర్వాత, "ప్రొద్దుట అమ్మాయి ద్వారా మీ గురించి విన్నాను. పరిస్థితంతా చెప్పింది. ఉద్యోగం చెయ్యడంలో మీకేమీ అభ్యంతరం లేకపోతే నాక్క తెలిసున్న కంపెనీ మేనేజర్ ఒకతనున్నాడు. రేపు ఉదయం పదింటికల్లా వస్తే వెళ్లి కల్సుకొందాం. ఏమంటారు?" అని అడిగారు సత్యనారాయణ గారు.

"అల్లాగే! రేపు పదింటికి మిమ్మల్ని కల్సు కొంటాను శలవ్" అని నమస్కారం చేసి వచ్చేశాడు.

మర్నాడు పదింటికి యిద్దరూ ఆ కంపెనీ మేనేజర్ దగ్గరికి వెళ్ళారు. సత్యమూర్తిని బయట కూర్చోబెట్టి, ముందు సత్యనారాయణగారు లోపలి కెళ్ళి మేనేజర్‌కి పరిచయం చేస్తూ, "నేను చెప్పింది ఇతని గురించేరా? ఏదో తీసుకొచ్చినందుకు నామాట దక్కించు" అన్నారు.

"అలాగేలేరా! నీమాట కాదంటానా! ఖాళీలు లేకపోతేగాని, ఉండగా బాధేముంది? నీకెందుకు నువ్వు ఆఫీసుకెళ్ళు. నేను ఎపాయింట్‌మెంట్ ఆర్డరిస్తే సరిగదా!" అన్నాడు.

"అయితే నేను వస్తారా! వెళ్ళొస్తా మిస్టర్ సత్యమూర్తి! సాయంత్రం యింటిదగ్గర కలుసుకుందాం." అని ఆయన వెళ్లిపోయాడు. మేనేజర్ సత్యమూర్తివైపు తిరిగి, "నిలబడేవున్నారేం, కూర్చోండి" అని ఎదురుగా వున్న కుర్చీ చూపించి, "మీరు గ్రాడ్యుయేట్ అని చెప్పాడు. ఏవి మీ/ సర్టిఫికేట్స్?" అని అడిగాడు. సత్యమూర్తి తీసి చూపించాడు ఆయన అవి పరీక్ష చేస్తుండగా తలుపుల స్ప్రింగ్ డోర్సు తెరచుకొని ఒక ఇరవై యేళ్ళ యువతి అకస్మాత్తుగా లోపలికొచ్చింది. ఆమె వస్తూనే సత్యమూర్తిని చూసి, "ఎవరు సత్యమూర్తిగారా? నమస్కారమండి." అంటూ పలుకరించింది. మేనేజర్ ఆశ్చర్యపోతూ, "ఏమిటీ వీరు నీకు తెలుసా?" అని అడిగారు కూతుర్ని.


"తెలియక పోవడమేమిటి డాడీ! సత్యమూర్తి గారని ప్రఖ్యాత రచయిత. రెండేళ్ళక్రితం మా కాలేజీలో సన్మానం కూడా చేసాం. అదీగాక నా ఫ్రెండ్ సుశీలలేదూ? రావు బహద్దూర్ గారమ్మాయి. ఈయన్ని లవ్‌మేరేజి చేసుకుంది." అంది నవ్వుతూ.

మేనేజర్ ముఖంలో అనేక మార్పులొచ్చాయి. అవి పైకి కనబడనీయకుండా కూతుర్ని గంభీరంగా, "ఇంతకీ ఇప్పుడెందుకొచ్చావ్" అని ప్రశ్నించారు.

"షాపింగ్‌కి వెళుతున్నాను. ఒక వందరూపాయలు కావాలి డాడీ." అంది గోముగా. ఆయన మారు మాట్లాడకుండా డబ్బుయిచ్చి పంపించేసాడు. ఆమెవెళ్తూ, "వస్తాను సత్యమూర్తి గారూ!" అని చకచక బయటికి వెళ్లిపోయింది ఆ తర్వాత పది నిమిషాలసేపు మేనేజర్‌గారు ఏదో గంభీరంగా ఆలోచించాడు. ఆతర్వాత సత్యమూర్తి మూర్తివైపు చూస్తూ, "మీలాంటి పెద్ద రచయితల్ని కలుసుకోగల్గినందుకు చాలా సంతోషంగావుంది. మీ రచనలు నేను కూడా చదివాను. కాని రెండేళ్ళనుంచీ పత్రికల్లో మీపేరు కనిపించడం లేదే?" అడిగారు అనుమానంగా.

"ఆరోగ్యం సరిలేక ఈమధ్య ఏమీ రాయలేదు లెండి" అని సమాధాన మిచ్చాడు. నిజానికి తను వ్రాసినా వేసుకోవడం లేదని ఎలా చెపుతాడు? ఏదో అభిమానం చంపుకోలేక అబద్ధమాడాల్సి వచ్చింది.

"దట్సాల్‌రైట్. ఒక రచయితగా మిమ్మల్ని



గౌరవిస్తాను. అభిమానిస్తాను. అంతేకాని ఒక గుమాస్తాగా మిమ్మల్ని నా దగ్గర వేసుకోలేక పోతున్నందుకు క్షమించండి" అన్నాడాయన ఒక్కసారిగా.

సత్యమూర్తి పాతాళుడై పోయాడు.

"కారణం తెలుసుకోవచ్చా?" అన్నాడు హీన స్వరంతో.

"ఏముంది. సాధారణంగా రచయితలు స్వతంత్ర ఆలోచనలతో ఎప్పుడూ వూహాలోకాల్లో వుంటారు. యాంత్రికంగా చెయ్యవల్సిన గుమాస్తాగిరీ వాళ్ళు చెయ్యలేరు. దీనికి ఎంతో వోర్పు కావాలి. తిట్టినా పడి వుండాలి. పిలిచినప్పుడల్లా పలకాలి. అంత కంటే ఆత్మాభిమానం చంపుకు బ్రతకాలి. అవని మీరు చెయ్యలేరు" ఒక్కముక్కలో తేల్చేశాడు.

"ఫర్వాలేదుసార్! మీరు చెప్పినట్లే పడుచు కుంటాను."

# రచయిత

"నో, నో, మిస్టర్ సత్యమూర్తి. ఏదో పరిస్థితులకి తల ఒగ్గి తాత్కాలికంగా ఈనాడు విన్నా, ఎప్పటికైనా మీకూ మాకూ కూడా యిబ్బందే. మీరీ పని చెయ్యలేరు. మీరు ఒక రచయితగానే గౌరవంగా వుండడం మంచిది." అన్నారాయన.

"అదికాదుసార్.....!" సత్యమూర్తి యింకా ఏదో చెప్పబోయాడు. ఆయన మధ్యలోనే అందుకొని "నేనొక అభిప్రాయానికి వస్తే అది ఎన్నటికీ మారదు సత్యమూర్తి గారూ! నామాట విని వెళ్ళిరండి" అన్నాడు.

సత్యమూర్తి విచారంగా యింటికి చేరుకున్నాడు. సుశీల ఆతృతగా గుమ్మం దగ్గర నిలబడి అతని రాకకోసం ఎదురుచూస్తోంది. తీరా సత్యమూర్తి వచ్చాక, పలుకరిద్దామని కూడా ఏమీ అడగలేకపోయింది. దానికతను గంభీరంగా వుండడమే కారణం. భార్యతో ఒక్కమాటకూడా మాట్లాడలేదు. భోజనాలదగ్గర కూడా యిద్దరూ మౌనంగానే వున్నారు. భోంచేసి సత్యమూర్తి తన గదిలోకి వెళ్ళిపోయి తలుపువేసికొని పడుకున్నాడు. సాయంకాలమైంది. ఐదుగంటలకి సత్యమూర్తి బయల్దేరాడు. ఎక్కడెక్కడో తిరిగొచ్చాడు. రాగానే కాళ్ళూ చేతులూ కడుక్కొని తిన్నగా తనగదిలోకి వెళ్ళిపోయాడు. ఆరోజంతా అతని ప్రవర్తన చాలా వింతగా వుంది. దానికి కారణమేమిటో సుశీలకి ఎంత ఆలోచించినా అంతుపట్ట లేదు.

రాత్రి 9 గంటలవుతోంది. సుశీల అతని గది కిటికీ దగ్గరికెళ్ళి తొంగి చూసింది. అతను టేబుల్ దగ్గర కూర్చుని ఏదో వ్రాస్తున్నాడు. ఆ సమయంలో పిలిస్తే అతనికి ఆలోచనా భంగం కల్గుతుందని సుశీల పిలవకుండానే వెళ్ళిపోయింది.

మర్నాడు తెల్లవారింది. బాగా బారెడు ప్రొద్దెక్కింది. అయినా సత్యమూర్తి గది తలుపులు తెరుచుకోలేదు. సుశీల తలుపుతడుతూ రెండుమూడు సార్లు పిలిచింది. లోపల్నించి ఎలాంటి జవాబు రాలేదు. ఈసారి దబదబ బాదుతూ కనీసం అరడజనుసార్లైనా పిలిచింది. అప్పటికీ సమాధానం రాలేదు. చుట్టుప్రక్కలవాళ్ళని పిలుచుకొచ్చింది. వాళ్ళుకూడా ఎన్నిసార్లు పిలిచినా లాభం లేకపోవడంతో ఇక తప్పని సరయి తలుపులు బ్రద్దలు కొట్టారు. సుశీల ఆతృతగా లోపలికెళ్ళి చూసింది. మంచం మీద సత్యమూర్తి శవం నిశ్చలంగా, నిర్మలంగా పడివుంది. ప్రక్కనే టేబుల్ మీద రెండు ఉత్తరాలు, ఒక విషపు సీసా కనిపించాయి. సుశీల ఆతృతగా ఉత్తరాలు తీసి చదివింది. ఒకటి తను ఆత్మహత్య చేసుకుం టున్నానని తన మరణంతో ఎవరికీ సంబంధం లేదని వ్రాసింది. రెండోది సుశీలకి,

"సుశీ,

బ్రతికుండి నిన్ను ఏవిధంగానూ సుఖపెట్టలేక పోయాను. నేను మరణించాక నీ తండ్రిదగ్గరికెళ్ళి సుఖంగా వుంటావని ఆశిస్తూ ఈ దారుణానికి ఒడిగడుతున్నాను. నన్ను క్షమించు.

ఇట్లు,

నీ అభాగ్యుడు,

సత్యమూర్తి."

అని వుంది.

సుశీల గొల్లుమని అతని శవంమీద పడి ఏడ్చింది. ఆ శోకమూర్తిని ఎవరూ వోదార్చలేక పోయారు. కొన్ని గంటల్లోనే ఈ విషయం వూరంతా పాక్కిపోయింది. రావు బహద్దూరుగారు కూడా వచ్చారు. బ్రతికుండగా ఒక్కరూ సాయం చేయలేదు. కాని సత్యమూర్తి మరణవార్త వినగానే విరివిగా చందాలు మాత్రం యిచ్చారు. ఆ డబ్బుతోనే సత్యమూర్తి అంత్యక్రియలు ఎంతో ఘనంగా జరిగాయి. మంచి గంధపుచెక్కలతో దహనం చేశారు. సాహిత్యలోకంలో ధ్రువతారగా వెలుగొందాల్సిన ఒక రచయిత లేడని అందరూ ఎంతో యిదిగా వాపోయారు. కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ ఆ యిల్లు విడిచి కన్నవారింటికి చేరుకుంది సుశీల.

